క్లుప్తంగా

స్నేహితురాలికి అండగా పూర్వవిద్యార్థులు



నగదును అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన మామిడాల శారద అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా, మృతురాలి కుమార్తె శ్రీలతతో కలిసి చదువుకున్న 2008–09 బ్యాచ్ 10వ తరగతి పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నేహం కోసం ఫౌండేషన్ తరపున రూ.10వేల నగదును శ్రీలతకు సోమవారం అందజేశారు. చింతల జైపాల్,అంకం రాజు, వేణు, జూడో శ్రీను, రామకృష్ణ, సంపత్, శ్రీకాంత్, గొలుసుల రాజు, వంగపల్లి సంధ్య తదితరులు ఉన్నారు.

కథల పోటీలో ఉషారాణికి బహుమతి



ఉషారాణికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న మోహన్, వెంకటరమణ

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కె.ఉషారాణికి చిన్న వయసులో గొప్ప తెలివి అనే కథకు ప్రోత్సాహక బహుమతిని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పత్తిపాక మోహన్, ఒక్కాకు వెంకటరమణ, దాసరి వెంకటరమణ చేతుల మీదుగా అందించారు. ఈ నెల 3న రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మాచరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీలో ఉషారాణికి ప్రోత్సాహక బహుమతిగా రూ.300 నగదు, ప్రశంస పత్రం, రూ.400 విలువైన చందమామ కథల పుస్తకాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కె.రాజేశ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఉషారాణిని అభినందించారు.

ఎన్నిక



సాయిలు

పాలకుర్తి: ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లంపల్లి గ్రామానికి చెందిన దేవరాయ సాయిలు ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ ఎరుకల సామాజిక వర్గ అభ్యున్నతికి పోరాడుతానని ఆయన పేర్కొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

రఘునాథపల్లి: బర్త్‌డే వేడుకల్లో గొడవ పడి ఇద్దరిపై కత్తితో దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ సోమవారం తెలిపారు. మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన చెరుకు వెంకటేశ్వర్లు, మల్లా మధులు గత నెల 22వ తేదీన స్నేహితుల సమక్షంలో బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. వేడుకల్లో స్నేహితుల మధ్య గొడవ చోటు చేసుకొంది. కూరపాటి రాజశేఖర్ అనే వ్యక్తి చెరుకు వెంకటేశ్వర్లు, కీర్తి వెంకటేష్‌లపై కత్తితో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'హక్కులకు ఉద్యమిద్దాం'



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్మెట: అమరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య అన్నారు. అమరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్య యాత్రను మండలకేంద్రంలో సోమవారం ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంఘటితం కోసం 1957లో సంఘం ఏర్పాటు చేసుకోగా, కామ్రేడ్ ధర్మ భిక్షం, తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, దేశిని చిన్న మల్లయ్య తదితరుల నాయకత్వంలో సొసైటీ, టీఎఫ్‌టీల ఏర్పాటు, చెట్టుపై గీత కార్మికులకు హక్కు, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్లను సాధించుకున్నామని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం కోసం రూ. 5వేల కోట్లను కేటాయించాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు గోపగోని యాదగిరి, జిల్లా కమిటి సభ్యులు వడ్లకొండ వెంకటేష్, గొల్లపల్లి మురళి, గౌరవ అధ్యక్షుడు గోపగోని శ్రీధర్, గోపగోని స్వామి, సతీష్, ముకుందం, రాకేష్, భాస్కర్, చెక్కిల్ల వెంకటేశ్వర్లు, రాములు, యాదగిరి, కృష్ణమూర్తి, అంజయ్య పాల్గొన్నారు.

నీళ్లు పారేదెలా..!?

- కాల్వల్లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు
- శుభ్రం చేయాలని కోరుతున్న రైతులు

లింగాలఘణపురం: గోదావరి జలాలతో చెరువులు నింపేందుకు ఇటీవల అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయగా లింగాలఘణపురం మండల కేంద్రంతో పాటు, క్లోం, సిరిపురం, మాణిక్యాపురం, జీడికల్ గ్రామాల చెరువులకు, కుంటలకు నీరు చేరుతుంది. ఈ నేపథ్యంలో అశ్వరావుపల్లి ప్రధాన కాలువ 16ఎల్ నుంచి మండల కేంద్రంలోని పాత చెరువులోనికి నీరు వెళ్తుంది. 16ఎల్ తూము నుంచి వచ్చే కాల్వ లింగాలఘణపురం–నెల్లుట్ల రోడ్డు పక్క నుంచే వెళ్తుంది. ఈ కాల్వలో ఎండిపోయిన ముళ్లపొదలు, తాటిచెట్లు మొత్తం వేసి నీరు పారకుండా చేశారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ పంపు వద్ద కాల్వలో అన్నీ పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి. దీంతో నీరు అంతా కాల్వలో కమ్ముకొని సాఫీగా రావడంలేదు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కంపచెట్లు, చెదారంతో నిండిన కాల్వను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.



కాల్వలో కంప చెట్లు, ఎండిన తాటి మొద్దులు

పేదలకు గూడు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే



ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న నర్సింహారెడ్డి

- డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి

నర్మెట: పేదలకు గూడు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని, ఇందిరమ్మ గరీబీ హఠావో నినాదంతో కాంగ్రెస్ పనిచేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్‌తో కలిసి ముగ్గు పోసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో బలహీణ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాదిన్నర పాలనలోనే ఎన్నికల హామీలు కార్యరూపం దాల్చాయని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో వలబోజు శ్రీనివాస్, కనిబోయిన రామకృష్ణ, దేవులపల్లి భాగ్యలక్ష్మి, గొట్టె రాజశేఖర్, సరాబు మధు, బూస అంజయ్య, గద్దం మహేష్, పాతూరి ప్రశాంత్, ఎండి రజాక్, గోపగోని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

చిల్పూరు: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎర్త్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పల్లగుట్ట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు అన్నారు. పల్లగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య, ఆరోగ్య, నైపుణ్యాల అభివృద్ధికి ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెద్ది ప్రమోద్, కలవేణి శ్రీనివాస్‌లు విద్యార్థులకు వాసం ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అప్‌గ్రేడ్ మై క్లాస్‌రూం సంస్థ సహకారంతో కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వెన్నెల, కోఆర్డినేటర్లు రాజు, ఆంజనేయులు, శోభ, స్పీకర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచకుంటే లక్ష మందితో గర్జన

రఘునాథపల్లి: ఈ నెల 13వ తేదీ లోపు దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు చేయూత పింఛన్లు రూ.4 వేలకు పెంచకుంటే హైదరాబాద్‌లో లక్ష మంది పింఛన్‌దారులతో గర్జన నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్‌మాదిగ హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులు, చేయూత పింఛన్ దారులతో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో మాదిరిగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో పింఛన్లు పెంచి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచే వరకు విశ్రమించబోమని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సునీల్‌మాదిగ

సమావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, నాయకులు గద్దం సందీప్, దున్నపోతుల యాదగిరి, లక్ష్మక్క, వెంకటేష్, రమేష్, భిక్షపతి, రాజు, కొమురయ్య, రాములు, మహేష్ పాల్గొన్నారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి



కాల్వను సందర్శించిన రైతు సంఘం బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలని అందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ అన్నారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కెనాల్ సందర్శన చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి పాలకుర్తి, చెన్నూరు, నవాబుపేట రిజర్వాయర్లు సాగునీరు కెనాల్‌కు అనుసంధానంగా నిర్మించిన ఎల్–3, ఎల్–4 పిల్ల కెనాల్ ద్వారా 12 చెరువులు, కుంటలు నింపాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుమారస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, కొడెపాక యాకయ్య, శ్రీను, మొగిళి, లింగన్న, ఎల్లయ్య, రాజు, అశోక్ పాల్గొన్నారు.

బోర్లలో తగ్గిన నీటిమట్టం

జఫర్‌గఢ్: గోదావరి జలాలను దేవాదుల కాల్వల ద్వారా తరలించి చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో సరైన వర్షాలు లేక చెరువులు, కుంటలలోకి నీరు రాక బోర్లల్లో నీటి మట్టం తగ్గిపోయి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, నల్లతీగల శ్రీను, ఎంపెల్లి అజయ్, రాయపురం భిక్షపతి, రాపర్తి రజిత, శంషోద్దీన్, నక్క యాకయ్య పాల్గొన్నారు.

'కేసీఆర్ పాలన స్వర్ణయుగం'

నర్మెట: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, కేసీఆర్ పాలన స్వర్ణయుగమని పార్టీ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోటాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి సోమవారం మండల కేంద్రంలో ముగ్గులు పోసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తండాలను గ్రామ పంచాయతీలు చేసిన కేసీఆర్ బడుగు బలహీణ వర్గాలకు, గిరిజనుల అభివృద్ధికి బాటలు వేసారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మండల, జిల్లా నాయకులు, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, నక్కల రవి, నక్కల తిరుపతి, ముక్కెర మహేందర్, పొన్నం బాలకృష్ణ, కరుణాకర్, కూకట్ల రవి, మెడుదుల రాజు, కనకయ్య పాల్గొన్నారు.



ముగ్గు పోస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇష్టపడి చదివితే లక్ష్యసాధన అనివార్యం



షూ అందుకున్న విద్యార్థులతో రమేశ్‌కుమార్

దేవరుప్పుల: విద్యార్థులు ఇష్టపడి చదివితే లక్ష్యసాధన అనివార్యమని లయన్స్ క్లబ్ జనగామ ప్రతినిధి రమేశ్ కుమార్ బజాజ్ అన్నారు. సోమవారం కామారెడ్డిగూడెం హైస్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులకు ఆయన షూ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను బోధించే ఉపాధ్యాయుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం రాజేంద్ర కుమార్, లయన్స్ కృష్ణాబజాజ్, వినోద్ కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌జీ, రమాదేవి, లక్ష్మణ్‌రావు, సుల్తానాబేగం పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు వెళ్లేదెలా..

- కుంటను తలపిస్తున్న రోడ్డు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచి కుంటను తలపిస్తుంది. ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందే రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుండటంతో ప్రయాణికులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డుపై కుంటలా నీరు నిలుస్తుండటంతో అందులో నుంచే ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కు రాక పోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిలువ కుండా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై కుంటను తలపించేలా నిలిచిన వర్షపు నీరు

మహిళా సంఘాల బలోపేతానికి పాటుపడాలి



మాట్లాడుతున్న శోభారాణి

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి అనుబంధ సిబ్బంది పాటుపడాలని ఐకేపీ ఏపీఎం తేరాల శోభారాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని చందన మండల సమాఖ్య కార్యాలయంలో దేవరుప్పు క్లస్టర్ పరిధి గ్రామైఖ్య సంఘాల వీఓఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ సంఘాలను పొదుపుతోపాటు తీసుకున్న రుణాలతో స్వయం సమృద్ధి సాధించే దిశలో చైతన్యం తేవాలన్నారు. ఆయా వీఓ పరిధి సంఘాల రికవరీ, కొత్త రుణాలు, దివ్యాంగుల కొత్త సంఘాల పురోగతి కోసం సంఘాల స్థితిగతులను బట్టి కార్యాచరణ సిద్ధం చేసి ఆచరణాత్మకంగా దోహదపడేలా తోడ్పాటు అందించాలన్నారు. రెండు దశాబ్దాల పైచిలుకు సంఘాల అభివృద్ధికి పాటుపడుతున్న వీఓఏలు మారుతున్న సాంకేతికత పరిజ్ఞానం పెంపొందించుకుంటూ శ్రమను తగ్గించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సందేహాలకు నివృత్తి చేశారు. ఐకేపీ సీసీలు శంకర్, సోమనారాయణ, సుదర్శన్, ఉమ, సిబ్బంది వెంకన్నలు పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

రఘునాథపల్లి: పింఛన్ల పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా ఫేస్ రికగ్నిషన్ (ఐరిస్) ద్వారా పింఛన్లు అందిస్తున్నట్లు ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఖిలాషాపూర్ తపాలా కార్యాలయంలో ఐరిస్ ద్వారా పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తపాలా బిపిఎం మొబైల్‌తో పలువురు పింఛన్ దారుల కళ్లను స్కాన్ చేశారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ లబ్ధిదారులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు ఉన్నారు.



మహిళ కంటిని స్కాన్ చేస్తున్న ఎంపీడీఓ

బాధిత కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలి

జనగామ రూరల్: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈ లక్ష్మీనారాయణ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నర్మెట్ట మండలం మల్కపేట గ్రామానికి చెందిన విద్యుత్ కార్మికుడు బానోత్ రాజు ఇటీవల అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడని, రాజు భార్య నీలకు విద్యుత్ శాఖలో పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, సంబంధిత శాఖ ద్వారా వారి కుటుంబానికి అందించే బెనిఫిట్స్ వెంటనే అందించాలని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

తల్లి పాలే శిశువుకు శ్రేయస్కరం

కొడకండ్ల: తల్లి పాలే శిశువుకు శ్రేయస్కరమని, బిడ్డకు అవసరమైన పోషకాలు లభిస్తాయని అంగన్‌వాడీ టీచర్లు పద్మ, నిర్మల అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నర్సింగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల ప్రాముఖ్యత, వ్యక్తిగత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎఎన్‌ఎం శోభ, ఆశ కార్యకర్త సావిత్రి, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

తరిగొప్పుల: మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు వెంటనే ముర్రుపాలు పట్టించడంతో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. డబ్బా పాలు పట్టించడం బిడ్డ ఆరోగ్యానికి హానికరమన్నారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సంతోష, వనిత, అంజమ్మ, శారద పాల్గొన్నారు.

చిన్నారులకు తల్లిపాలు పట్టించాలి

బచ్చన్నపేట: చిన్నారులకు తల్లిపాలు తప్పకుండా పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. మండలంలోని లింగంపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు విజయ,పద్మ ఆశాలు పద్మ, కావ్య, ఆయాలు, ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



కొడకండ్ల: చేతుల పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

రఘునాథపల్లి: తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండలంలోని భాంజీపేట శివారు పిట్టలగూడెంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలతో కలిగే ప్రయోజనాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలను పట్టించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లి పాలు అందిస్తే బిడ్డ ఎదుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందన్నారు. తల్లిపాల విశిష్టతను ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, హెల్పర్ సుమలత, తల్లులు పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: ఈరవెన్నులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం

పాలకుర్తి టౌన్: తల్లిపాలు శివువుకు ఎంతో శ్రేష్టమైనవని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దేవేందర్ రెడ్డి అన్నారు. ఈరవెన్నులో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, తల్లులు, పిల్లలకు తల్లిపాల పై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు అరుణ, స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలు

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు బోనాల వేడుకలను నిర్వహించారు. సోమవారం మండలకేంద్రంలో విద్యార్థులకు బోనాల సాంప్రదాయాన్ని వివరిస్తూ అవగాహన కల్పించి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దోర్నం ప్రభాకర్, ఉమేష్, వేణు, కవిత, వెంకటయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

దేవరుప్పుల: మండలంలోని ధర్మగడ్డతండా, సింగరాజుపల్లి, చిన్నమడూరు, నీర్మాల, కోలుకొండ, అప్పిరెడిపల్లె తదితర గ్రామాల్లో ఓనమాలకు ప్రతీకగా నిలిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడూతూ పిల్లలకు తల్లి మురిపాలు ప్రాముఖ్యత, ఆరు నెలల దాటాకా పెట్టాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

బ్రిడ్జి నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు స్పందించాలి

జనగామ రూరల్: గానుగపహడ్, చీటకోడూర్ బ్రిడ్జి నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు, కలెక్టర్ స్పందించాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ ఉమెన్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ బి.నవ్య, లలిత అన్నారు. కలెక్టరేట్ వద్ద చేపడుతున్న దీక్షలకు సోమవారం మద్దతు పలికి మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఇరుగు సిద్దులు జిల్లా చైర్మన్ అరుణ్ కుమార్, వైస్ చైర్మన్ రమావత్ తిరుపతి, ఆర్‌టీఐ చైర్మన్ ఉమాపతి కన్స్యూమర్ చైర్మన్ బి.రాజు, ఎ.నితీష్, బోడ నరేందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

చిల్పూరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు సోమవారం మల్కాపూర్ గ్రామం నుంచి కొత్తపల్లికు వెళ్లే రోడ్ గుంతలమయంగా మారడంతో బీటీ రోడ్డుగా నిర్మించేందుకు ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి ఎస్టిమేషన్ వేయించారు.

దయగల గోడ ఏర్పాటు

పాలకుర్తి టౌన్: పేదలకు పాత వస్త్రాతలు, ఇతర ఉపయోగకరమైన వస్తువులు అందించేందుకు దయగల గోడ(వాల్ ఆఫ్ కైండ్‌నెస్) కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ మదార్, కాంగ్రెస్ నాయకుడు మేడారపు సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దయగల గోడను వారు ప్రారంభించి మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా వావిలాల, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌తో పాటు, పాలకుర్తిలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి వ్యక్తిగత సహాయకుడు మద్దెల రాజేష్‌గౌడ్ సహకారంతో పాలకుర్తిలో దయగల గోడను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వస్తువులు, వస్త్రలు అందజేశారు. జంపాల కృష్ణ, దామెర అశోక్, హకీమ్, శోభన్, మధు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఢిల్లీలో కడియం కావ్యను కలిసిన రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్లిన టీపీసీసీ లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్, స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్ ఎంపీ కడియం కావ్యను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశాడు.

సన్మానం

దేవరుప్పుల: మాదాపురం రెవెన్యూ పరిధి దుబ్బతండాకు చెందిన కేయూ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకుడు, రిటైర్డ్ డ్రైవర్ లకావత్ యాదగిరిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ వాస్తవ్యుడిగా విశ్వ విద్యాలయంలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన యాదగిరి సమాజ హితం కోసం పాటుపడాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం



లుంబా

దేవరుప్పుల: మాదాపురం రెవెన్యూ పరిధి పడమటితండాకు చెందిన భూక్య లుంబా అదృశ్యమై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని, అతని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

జనగామ: చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ట్రైన్‌లో వెళ్తున్న ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ భవిష్యత్ కోసం పలు సూచనలు చేశారని, బీసీ రిజర్వేషన్ కోసం కాంగ్రెస్‌పార్టీ మాత్రమే పోరాడుతుందని, అమలు చేయడం జరుగుతుందని మీనాక్షి నటరాజన్ తెలిపారని పేర్కొన్నారు.

ముగిసిన భక్తాంజనేయ ఆలయ వార్షికోత్సవాలు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి శివారులోని గుప్త ప్రసన్న భక్తాంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవాలు సోమవారం అత్యంత భక్తిశ్రద్దలతో ముగిశాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్లపల్లి హరికిషన్‌రావు–హరిప్రియ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు మురళి, అర్చక పరివారిక బృందం మంత్రోచ్ఛరణాలతో సుందరకాండ సహస్ర శ్లోక రామాయణం హవనం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ రవికుమార్ పాల్గొన్నారు.

అపరిష్కృత భూసమస్యలను పరిష్కరించాలి

దేవరుప్పుల: గత పదేళ్లుగా పేరుకపోయిన అపరిష్కృత భూసమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం(ఐ) పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆడెపు అండాలుకు భూసమస్యల పరిష్కారంకై వినతి పత్రం అందజేశారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల: చిన్నమడూరులో వీరాంజనేయ ఆటో యూనియన్ (రిజిస్టర్ నంబర్: 659/2017) నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా పానుగంటి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మండల ఉపాధ్యక్షుడిగా కోట దర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా మైదం వృకోదర్, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సంఘ సమస్యల సాధనం కోసం ఐక్యమత్యంతో కలిసి పనిచేయాలని తీర్మానించుకున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పాలకుర్తి టౌన్: ఉపాధ్యా, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో దశ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రాల్లో జరిగే ధర్నాను విజయవం చేయాలని ఉపాధ్యా సంఘాల పోరాట కమిటీ మండల నాయకుడు ఇమ్మడి అశోక్ పిలునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. సమస్యల సాధన కోసం ఉపాధ్యాయులు ధర్నాకు తరలిరావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

పాలకుర్తి టౌన్: ఐకేపీ ఏపీఎంగా శ్రీరాముల చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యపేట కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌డీఓలో ఐబీ ఏపీఎంగా పని చేస్తున్న చంద్రశేఖర్ పాలకుర్తి ఏపీఎంగా బదిలీ కాగా, పాలకుర్తి ఎంపీఎంగా పనిచేసిన పిట్టల నరేందర్ జిల్లాలోని చిల్పూర్ ఏపీఎంగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యలు స్వీకరించిన ఏపీఎం చంద్రశేఖర్‌ను సీసీలు కారుపోతులు వెంకటేశ్వర్లు, అనురాధ, వెంకన్న, శోభ, యాదగిరి, ఐకేపీ సిబ్బంది సన్మానించారు.